సాక్షి శ్రీకాకుళం

శనివారం । 27 । ఏప్రిల్ । 2024



మత్స్యకారులకు..

మత్స్యకారులను వైఎస్ జగన్ సర్కారు అన్ని విధాలా ఆదుకుంటోంది. సబ్సిడీ డీజిల్ రాయితీ కూడా పెంచింది.

- 8లో



ఓటు విలువ తెలుసుకో..

హిరమండలం: ఓటు హక్కు ఆవశ్యకతపై వినూత్న రీతిలో ప్రచారం చేస్తున్నారు. అర్హులంతా ఓటు వేయాలనే ఉద్దేశంతో ఆర్టీసీ బస్సులపై కూడా ఇలా వాల్‌పోస్టర్లు అతికిస్తున్నారు. వాల్ రైటింగ్, ర్యాలీల ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు.

బూరగాంలో అగ్ని ప్రమాదం

టెక్కలి రూరల్: బూరగాం గ్రామంలో శుక్రవారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించింది. రోడ్డుకు ఇరువైపులా ఉన్న తెట్టంగి పంట వ్యర్థాలు కాలి మంటలు ఒక్కసారిగా ఎగసి పడ్డాయి. గ్రామంలోని ఉన్న తారు రోడ్డులో 800 మీటర్ల దూరం వరకు రోడ్డుకు ఇరువైపులా విత్తనాలు తీసేసిన తెట్టింగి కొమ్మలను పడేసి ఉన్నారు. దీంతో ఇవి రాజుకుని మంటలు ఎగసి పడ్డాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపుచేశారు.

న్యూస్‌రీల్

ఓటింగ్‌పై వీడియో చెయ్యండి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటు హక్కుపై జనాలకు అవగాహన పెంచేందుకు వీడియో, పోస్టర్లు తయారు చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. 'ఓటేద్దాం –శ్రీకాకుళం' అనే అంశంపై వీడియో తయారు చేయాలని, పోస్టర్ డిజైనింగ్ కూడా ఉందని ఆన్‌లైన్‌లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. వీడియో నిడివి 2–3 నిమిషాలు ఉండాలని, సైజు 200 ఎంబీ లోపు ఎంపీ–4 ఫార్మేట్‌లో ఉండాలని సూచించారు. పోస్టర్ సైజు 20ఎంబీ లోపు జేపీఈజీ, పీడీఎఫ్ ఫార్మాట్‌లో ఉండాలని తెలిపారు. వీడియో, పోస్టర్‌లో ఏ రాజకీయ పార్టీకి గానీ, నాయకుడికి గానీ సంబంధించిన వ్యాఖ్యలు ఉండకూడదని స్పష్టం చేశారు. గుర్తులు, జెండాల ప్రస్తావన కూడా ఉండకూడదన్నారు. మే 3 లోపు ఎంట్రీలు పంపించాలన్నారు. వీడియో చిత్రీకరణలో విజేతలకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు బహుమతులు అందిస్తామని, పోస్టర్ డిజైన్‌లో విజేతలకు రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి అందజేస్తామని పేర్కొన్నారు. తయారు చేసిన వీడియో/పోస్టర్‌లు https://forms.gle/UKNx34zL4YrT9mMW6 , QR Code లో పంపాలని తెలిపారు. వివరాల కోసం వాట్సాప్ నంబర్ 8121585151ను సంప్రదించాలని తెలిపారు.

ఎన్నికల నియంత్రణ కేంద్రం పరిశీలన



ఎన్నికల కంట్రోల్ రూమ్‌ని పరిశీలిస్తున్న పరిశీలకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాకు నియమితులైన వ్యయ పరిశీలకులు, ఐఆర్ఎస్ అధికారులైన కోమల్ జిత్ మీనా, శరవణ కుమార్, నవీన్ కుమార్ సోనీలు శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ (ఎన్నికల నియంత్రణ కేంద్రం) ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల కంట్రోల్ రూమ్ ఇన్‌చార్జి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు అన్ని విభాగాలను పరిచయం చేశారు. అన్ని విభాగాల సిబ్బంది నిర్వహిస్తున్న విధులపై పరిశీలకులు ఆరా తీశారు. మీడియాలో ఎన్నికల ఏర్పాట్లపై, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై వచ్చే ప్రతికూల వార్తలను నమోదు చేసే విధానం, వాటి పరిష్కార తీరును పరిశీలించారు. ఆయా విభాగాలు నిర్వహిస్తున్న రిజిస్టర్లను తనిఖీ చేశారు.

'నూతన ఆవిష్కరణలపై ప్రత్యేక దృష్టి'

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీ సెమినార్ హాల్‌లో ప్రపంచ మేధో సంపత్తి దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు లక్ష్యంగా ముందుకు సాగాలని అన్నారు. దేశం సాంకేతికంగా ప్రస్తుతం శరవేగంగా ప్రగతి సాధిస్తోందని, మేధో సంపత్తి హక్కులు తీసుకొని నూతన ఆవిష్కరణలతో పరిశ్రమలు ఏర్పాటు చేసే స్థాయికి విద్యార్థులు చేరాలని అన్నారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత లక్ష్యంగా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.సుజాత, రెక్టార్ బి.అడ్డయ్య సైంటిఫిక్ అధికారి ప్రీతి నిహారిక పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల్లో నామినేషన్ల పరిశీలన పర్వం ముగిసింది. శ్రీకాకుళం ఎంపీ స్థానానికి 16 మంది నామినేషన్లు వేయగా ముగ్గురి నామినేషన్లను తిరస్కరించారు. అలాగే ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 107 మంది నామినేషన్లు వేయగా 25 మంది నామినేషన్లను తిరస్కరించారు. 82 మందివి ఆమోదించారు. ప్రధాన పార్టీ అభ్యర్థుల నామినేషన్లు ఏవీ తిరస్కరణకు గురి కాలేదు.

అసెంబ్లీ స్థానాల్లో..

నియోజకవర్గం	తిరస్కారం	ఆమోదం
ఇచ్ఛాపురం	04	09
పలాస	04	10
టెక్కలి	02	08
పాతపట్నం	03	10
ఆమదాలవలస	03	16
ఎచ్చెర్ల	05	12
శ్రీకాకుళం	01	09
నరసన్నపేట	03	08
మొత్తం	25	82

నీరు చెట్టు ▸ అంతా కనికట్టు

'నీరు–చెట్టు', గట్టు, మట్టి కాదేదీ అక్రమానికి అనర్హం అన్న రీతిలో టీడీపీ నాయకులు వ్యవహరించారు. అప్పట్లో అధికారం చేతిలో ఉందని అందిన కాడికి దోచుకున్నారు. ఓటు వేసిన పాపానికి 2014–19 మధ్య కాలంలో ప్రజా ధనాన్ని లూటీ చేసి తమ ఆస్తులు పెంచుకున్నారు. ఈ అక్రమాల వల్లనే టీడీపీని జనం అధికార పీఠం నుంచి తోసిపారేశారు. ఆ అవినీతి ఆనవాళ్లు ఇప్పటికీ జిల్లాలో కనిపిస్తూనే ఉన్నాయి. అయినా మళ్లీ అధికారం కోసం జనం ముందు కొత్త హామీలతో తయారైపోతున్నారు.





దాదాపు రూ.10కోట్లతో నీరు–చెట్టు పథకం కింద చేపట్టిన పనుల్లోని చెక్‌డ్యామ్‌లివి. నిర్మించిన కొన్ని రోజులకే కొట్టుకుపోయాయి. నాటి ప్రభుత్వ విప్ కూన రవికుమార్ సోదరుడు సత్యనారాయణ అండ్ కో సబ్ కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తూ చేపట్టిన నాసిరకం పనులవి. పొందూరు మండలంలో రెల్లిగెడ్డకు సంబంధించి తాడివలస వద్ద, సారవ గుమ్మి వద్ద కొట్టుకుపోయిన చెక్‌డ్యాం గేట్లు టీడీపీ నేతల అవినీతికి నిలువెత్తు నిదర్శనాలు.



పొందూరు మండలం తాడివలస రెల్లిగెడ్డ కోసమని నిర్మించిన రక్షణ గోడలివి. నిర్మించిన కొన్ని రోజులకే కూలిపోయింది. టీడీపీ నేత కూన రవికుమార్ అనుయాయులంతా చేసిన అవినీతి బాగోతానికి కూలిపోయిన రక్షణ గోడ నిలువెత్తు సాక్ష్యంగా మిగిలిపోయింది.

- చంద్రబాబు హయాంలో నీరు–చెట్టు పేరుతో భారీ దోపిడీ
- ఇప్పటికీ కనిపిస్తున్న నాటి ఆనవాళ్లు
- ఆధారాలతో సహా బయటపెట్టిన విజిలెన్స్ అధికారులు
- నాటి అక్రమాల వల్లనే అధికారం కోల్పోయిన టీడీపీ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

జిల్లావ్యాప్తంగా బాబు వదిలిన ఇలాంటి అవినీతి మరకలు ఎన్నో ఉన్నాయి. నీరు–చెట్టు అని ఓ పథకం పెట్టి, ఇష్టానుసారం టీడీపీ నాయకుల జేబులు నింపారు. చంద్రబాబు హయాంలో జిల్లాలో రూ.427.24కోట్ల అంచనా వ్యయంతో పనులు మొదలుపెట్టి మూడో వంతు సొమ్మును మింగేశారు. వీరి అవినీతి బాగోతమంతా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో వెలుగు చూసింది.

జిల్లాలో అతి పెద్ద కుంభకోణం..



గ్రామ స్థాయి నుంచి ఎమ్మెల్యేల వరకు యథేచ్ఛగా నీరు–చెట్టు నిధులను దోచేశారు. ఇంజినీరింగ్ అధికారులను గుప్పెట్లో పెట్టుకుని అడ్డగోలుగా తినేశారు. చెరువుల్లో మట్టి తవ్వకాల పేరుతో క్యూబిక్ మీటర్‌కు రూ.29 చొప్పున ప్రభుత్వం నుంచి నిధులు డ్రా చేసుకోగా, తవ్విన మట్టిని అమ్ముకుని కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారు. నీరు చెట్టు పథకం కింద చెరువుల్లో తవ్విన మట్టిని సామాజిక అవసరాలకు వినియోగించాలన్న ఆదేశాలను తెలుగు తమ్ముళ్లు భేఖాతరు చేశారు. చెరువుల తవ్వకాలు, రిటైనింగ్ వాల్, చెక్‌డ్యామ్‌లు, స్లూయిజ్‌లు,...ఇలా రకరకాల కాంక్రీటు పనుల రూపంలో



కూడా పెద్ద ఎత్తున నిధుల స్వాహాకు పాల్పడ్డారు. నాసిరకం పనులు చేపట్టి కొన్ని చోట్ల... గతంలో చేసిన పనులకు మెరుగులు దిద్ది మరికొన్ని చోట్ల, నాసిరకం నిర్మాణ సామగ్రితో ఇంకొన్ని చోట్ల.. అక్రమాలకు పాల్పడ్డారు. కొన్ని చోట్లయితే అసంపూర్తిగా పనులు చేసి పూర్తి స్థాయిలో బిల్లులు చేసుకోగా, పలు గ్రామాల్లో పనులు చేయకుండానే నిధులు డ్రా చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇదంతా ఒక ఎత్తయితే రూ.5లక్షలకు మించిన పనులను టెండర్ల ద్వారా ఖరారు చేయాల్సి ఉండగా నిబంధనలకు తిలోదకాలిచ్చి ఏకపక్షంగా పనులు కొట్టేశారు. నీరు–చెట్టు నిధులను నామినేటేడ్ పద్ధతిలో మింగేశారు.

చెలరేగిపోయిన జన్మభూమి కమిటీలు

పథకాలు ఓ వైపున ఉంటే..జన్మభూమి కమిటీల పేరిట ఊరూరా టీడీపీ చేసిన దౌర్జన్యం ఇంకా జనం కళ్ల ముందు కదలాడుతోంది. నీరు–చెట్టు కింద చేపట్టే పనులన్నీ వారే దక్కించుకున్నారు. గ్రామాల వారీగా నిధులు పంచేసుకున్నారు. టీడీపీ సర్పంచ్‌లున్న చోట జన్మభూమి కమిటీలు కుమ్మక్కై పనులు చేపట్టగా, టీడీపీ సర్పంచ్‌లు లేని చోట జన్మభూమి కమిటీలు, ఇతర నాయకులు ఏకపక్షంగా పనులు చేసి నిధులు బొక్కేశారు. టీడీపీ నేతల ధనదాహాన్ని అడ్డుకునేలా ఎక్కడైతే వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు ఉన్నారో అక్కడ నిధులు మంజూరు చేయకపోవడం విశేషం.

విచారణలో వెలుగు చూసిన అక్రమాలు

జిల్లాలో జరిగిన నీరు చెట్టు పనులపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టగా అక్రమాలన్నీ బయటపడ్డాయి. ఏ రకంగా అవినీతికి పాల్పడ్డారో గుర్తించారు. శ్రీకాకుళం జిల్లాలో రూ.427.24కోట్ల విలువైన 5696 పనులను విచారణ చేశారు. రకరకాలుగా అక్రమాలకు పాల్పడినట్టు విచారణాధికారులు నిగ్గు తేల్చారు. వారు పేర్కొన్న వివరాల మేరకు..

- నిబంధనలకు విరుద్ధంగా మట్టి పనిచేశారు. మదుము అడుగు భాగం కంటే బాగా దిగువన మట్టి పనులు చేసి అడ్డగోలుగా నిధులు డ్రా చేశారు.
- ఉన్న చెరువు గట్లను బలపడేటట్లు చేయకుండా దానికి బదులు చెరువు గర్భం ఆవల గల ప్రాంతంలో గట్లను వేశారు. మట్టి తవ్వకాల కింద క్యూబిక్ మీటర్‌కు రూ.29కు గాను రూ. 82.80చెల్లించారు. అంటే క్యూబిక్ మీటర్‌కి రూ. 53.80 చొప్పున అధికంగా చెల్లించారు.
- పనులు టెండర్ల వరకు వెళ్లకుండా టీడీపీ నేతలకు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టేందుకు ఒక పనిని ముక్కలు ముక్కలుగా విడదీశారు.
- తవ్విన మట్టిని ప్రధాన గట్టుపై వేయకుండా ఇతర అవసరాలకు వినియోగించారు.
- నిబంధనల ప్రకారం రూ.5లక్షల విలువ లోపు గల పనులను మాత్రమే నామినేటేడ్ ద్వారా చేపట్టాలి. కానీ శ్రీకాకుళం జిల్లాలో రూ. 50లక్షలు వరకు నామినేషన్ ద్వారా పనులను కట్టబెట్టి నిధులు స్వాహా చేసేశారు.
- నిబంధనల ప్రకారం 50 ఎకరాల ఆయకట్టు పైబడిన చెరువుల్లో మాత్రమే నీరు చెట్టు పనులు చేపట్టాలి. కానీ అందుకు భిన్నంగా 50 ఎకరాలు కంటే తక్కువ ఆయకట్టు ఉన్న చెరువుల్లో కూడా పనులు చూపి నిధులు దుర్వినియోగం చేశారు.
- గెడ్డ లేదా వాగు నీటి ప్రవాహాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, ఎలాంటి డిజైన్ లేకుండా చెక్‌డ్యామ్‌లను నిర్మించారు.
- నాసిరకంగా కాంక్రీటు పనులు చేపట్టారు.
- 10హెచ్ నిబంధనలకు విరుద్ధంగా మట్టి పని చేపట్టి కాంట్రాక్టర్ లబ్ధిపొందారు.

ఓటు వేసేది వీరే..!



- ఓటర్ల సంఖ్య 18,75,934
- కొత్తగా చేర్పించిన ఓటర్లు 26,180 మంది
- తొలగించిన ఓటర్లు 10,156

నియోజకవర్గం	ఈ జనవరి నాటికి ఓటర్ల సంఖ్య	ప్రస్తుత ఓటర్ల సంఖ్య	చేర్పులు	తొలగింపులు
ఇచ్ఛాపురం	2,66,023	2,68,202	2865	686
పలాస	2,18,208	2,19,348	3855	2715
టెక్కలి	2,34,337	2,36,327	3406	1416
పాతపట్నం	2,23,157	2,25,313	2666	510
శ్రీకాకుళం	2,70,055	2,73,260	4222	1017
ఆమదాలవలస	1,92,560	1,93,858	2098	800
ఎచ్చెర్ల	2,42,637	2,44,760	4124	2001
నరసన్నపేట	2,12,933	2,14,866	2944	1011
మొత్తం	18,59,910	18,75,934	26,180	10,156

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన తుది జాబితా సిద్ధమైంది. కొత్త ఓటర్ల నమోదుకు గడువు ముగిసింది. ఇక కొత్త దరఖాస్తులు వచ్చినా ఎన్నికల తర్వాత మాత్రమే వారిని ఓటరుగా నమోదు చేస్తారు. దీంతో ఈ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వీరు మాత్రమే ఈ ఎన్నికల్లో ఓటు వేయగలరు. జిల్లాలో తాజాగా జరిగిన సమ్మరీలో 26,180 మంది కొత్త ఓటర్లను జాబితాలో చేర్చగా, 10,156 మంది ఓటర్లను వివిధ కారణాలతో తొలగించారు. 2024 జనవరిలో ప్రత్యేక సమ్మరీ నాటికి జిల్లాలో 18,59,910 మంది ఓటర్లు ఉండగా, ఈ ఎన్నికల సమయానికి ఈ ఓటర్ల సంఖ్య 18,75,934కి చేరింది. అంటే గతం కంటే 16,024 మంది ఓటర్లు పెరిగారు. మొత్తం ఓటర్లలో మహిళా ఓటర్లు ఎక్కువ మంది ఉండగా, ఇటీవల పెరిగిన ఓటర్లలో కూడా మహిళలే ఎక్కువగా ఉన్నారు.

టీడీపీ మేనిఫెస్టోను ప్రజలు నమ్మరు

- వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మేమంతా సిద్ధం బస్సు యాత్ర, టెక్కలి బహిరంగ సభకు హాజరైన ప్రజలు చూపించిన అభిమానం, ఆదరణ అపూర్వమని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. నగరంలోని టౌన్‌హాల్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ మేనిఫెస్టోను జనం నమ్మబోరని అన్నారు. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను పవిత్రంగా చూస్తుందని తెలిపారు. ఇటీవల టెక్కలిలో నిర్వహించిన మేమంతా సిద్ధం బహిరంగ సభలో సీఎం జగన్ మోహన్ రెడ్డి అభ్యర్థులను పరిచయం చేసిన తీరు చూసి అందరూ ముచ్చటపడ్డారని అన్నారు. దేశ చరిత్రలోనే ఏ సీఎం అందించని విధంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. కూటమి నేతలు స్వార్థ ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే చంద్రబాబుకు ప్రజలు గుర్తుకు వస్తారని దుయ్యబట్టారు. మా గ్రామాన్ని, మా ప్రాంతాన్ని, మా ఇంటిని, మా ఇంటి వారిని ఆర్థికంగా ఆదుకున్నది, అభివృద్ధి చేసింది వైఎస్ జగనేనని ప్రజలు నమ్ముతారని చెప్పారు. మూలపేట పోర్టు నిర్మించి ప్రపంచంతో కనెక్టివిటీని పెంచిన గొప్ప పరిపాలనా దక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. నాడు వైఎస్సార్ రిమ్స్, వంశధార వంటి ప్రాజెక్టులు నిర్మిస్తే ఆయన తనయుడు మూలపేట పోర్టుతో జిల్లా రూపురేఖలు మార్చేస్తున్నారని అన్నారు. సమావేశంలో కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, ఎంఎ బేగ్, మండవిల్లి రవి, ఏవీ రమేష్, కె.గురువులు తదితరులు పాల్గొన్నారు.

పశు సంవర్ధక శాఖ ఉత్తమ డివిజన్‌గా టెక్కలి



అమరేంద్రకుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న టెక్కలి డీడీ జయరాజ్

టెక్కలి: పశు సంవర్ధక శాఖ ఉత్తమ డివిజన్‌గా టెక్కలి నిలిచిందని డీడీ వి.జయరాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 45 డివిజన్ల పరిధిలో అన్ని రకాల లక్ష్యాలను సాధించి అభివృద్ధి కనబరచడంతో ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్ చేతుల మీదుగా టెక్కలి డీడీ వి.జయరాజ్ మెడిటోరియస్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో గల పశు సంవర్ధక శాఖ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ప్రచార పర్వం

దీవెనలు కోరుతూ..

ఓ వైపు కొండల్లో పార్టీ జెండాలు ఎగురుతున్నాయి. మరోవైపు జనం గుండెల్లో పాటలు వినిపిస్తున్నాయి. పార్టీ కోసం నాయకులు, నాయకుల కోసం వారి కుటుంబ సభ్యులు, ఆ కుటుంబాల కోసం అనుచరులు ఎన్నికల ప్రచారంలో పాలు పంచుకుంటున్నారు. జనం దీవెనలు కోరుతూ వారితో మమేకమవుతున్నారు.



వజ్రపుకొత్తూరు రూరల్: మంత్రి సీదిరి అప్పలరాజు ఎన్నికల ప్రచారంలో అన్ని వర్గాలను కలుపుకుంటూ వెళ్తున్నారు. గరుడభద్ర పంచాయతీలో మహిళలు, చిన్నారులతో ఇలా మాట కలిపారు.



మెళియాపుట్టి: ఎమ్మెల్యే రెడ్డి శాంతి కొండ కోనలను కూడా వదలకుండా ప్రచారం చేస్తున్నారు. గొడ్డ గ్రామంలో గిరిజన మహిళలతో కలిసి ఇలా కుళాయి నీరు పట్టారు.



ఆమదాలవలస: స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రచారంలో జోరు పెంచారు. సొట్టవానిపేటలో పార్టీ కార్యకర్తలతో కలిసి ఇలా ప్రచారం నిర్వహించారు.



ఎచ్చెర్ల: ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్నారు. కుంకాం గ్రామంలోని ఓ ఇంటిలో ఆడపడుచు ఇలా విజయ తిలకం దిద్దారు.



టెక్కలి: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ హుషారుగా ప్రచారం చేస్తున్నారు. బూరగాంలో 'జెండాలు జతకట్టడమే మీ అజెండా' అనే పాటకు ఇలా కాలు కదిపారు.



కంచిలి: ఇచ్ఛాపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ సామాన్యులతో మమేకమవుతున్నారు. కుత్తుం పంచాయతీలో స్థానికులతో ఇలా కలిసిపోయారు.



నరసన్నపేట: ధర్మాన కృష్ణదాస్ గెలుపు బాధ్యతను కుమారుడు కృష్ణ చైతన్య భుజానికెత్తుకున్నారు. లుకలాంలో ఇలా ఉత్సాహంగా ప్రచారం నిర్వహించారు.



గార: శ్రీకాకుళం గెలుపును తండ్రి ధర్మాన ప్రసాదరావుకు కానకగా ఇవ్వడానికి కుమారుడు రామ్‌మనోహర్ నాయుడు కష్టపడుతున్నారు. కె.సైరిగాం పంచాయతీలో అన్ని వర్గాలతో మమేకమయ్యారు.

అనుమతి లేని ప్రచార వాహనం గుర్తింపు

నరసన్నపేట: అనుమతి లేకుండా స్థానిక టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తిని గెలిపించాలని ప్రచారం చేస్తున్న ఒక ఆటోను ఎన్నికల నిఘా అధికారులు శుక్రవారం గుర్తించారు. జిల్లా స్పెషల్ స్క్వాడ్ సిబ్బంది అసిస్టెంట్ కలెక్టర్ ఆదేశాలతో తనిఖీలు చేపట్టగా మండలం జమ్ము కూడలి వద్ద టీడీపీకి చెందిన ప్రచార వాహనానికి సరైన అనుమతులు లేనట్లు తేలింది. వెంటనే స్థానిక స్క్వాడ్ ఇన్‌చార్జి రాజుకు సమాచారం ఇవ్వగా ఆయన వచ్చి ప్రచార రథానికి కట్టి ఉన్న టీడీపీ ఫ్లెక్సీలను తొలగించారు. ఈ వాహనానికి మైక్‌కు అనుమతి ఉన్నప్పటికీ ఫ్లెక్సీలు కట్టేందుకు అనుమతి లేకపోవడంతో వాటిని తొలగించాలమని స్క్వాడ్ అధికారి రాజు తెలిపారు. దీనిపై ఆర్‌ఓ రామ్మోహనరావు మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు.

క్లుప్తంగా

కూర్మనాథుని సన్నిధిలో ఎన్నికల పరిశీలకులు



ఆలయంలో ఎన్నికల పరిశీలకులు

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని శ్రీకూర్మనాథున్ని సార్వత్రిక ఎన్నికల పరిశీలకులు ఐఆర్ఎస్‌లు నవీన్‌కుమార్ సోని, కోమల్‌జిత్ మీనాలు శుక్రవారం దర్శించుకున్నారు. ముందుగా మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశిష్టతను ఆలయ ప్రధానార్చకులు సీతారామనృసింహాచార్యులు తెలియజేయగా, కిషోర్‌బాబు తదితరులు క్షేత్ర ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.శ్రీను, నర్సుబాబు పాల్గొన్నారు.

వర్సిటీ వెబ్‌సైట్ ప్రారంభం



అధికారులతో చర్చిస్తున్న వీసీ రజని

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రస్తుత కాలానికి అనుగుణంగా మార్పులు తప్పనిసరని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీ పాలక మండలి సమావేశ మందిరంలో శుక్రవారం ఆధునికీకరించిన వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు పూర్తి సమాచారం అందుబాటులో ఉంచాలని, వర్సిటీ సమాచారం, ప్రగతి సమాచారం వెబ్‌సైట్‌లో కనిపించాలని వీసీ సూచించారు. వర్సిటీలో జరుగుతున్న ప్రతి అభివృద్ధి వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.సుజాత, రెక్టార్ బి.అడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్ఎస్‌టీఎఫ్ కార్యవర్గ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

శ్రీకాకుళం అర్బన్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు కరిమి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని భారత స్కౌట్స్, గైడ్స్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు వై.వి.రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాంఘిక శాస్త్ర సిలబస్ భారం తగ్గించాలని, విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి పాఠశాలకు రెండేసి సాంఘిక ఉపాధ్యాయ పోస్టులు కేటాయించాలని పలు తీర్మానాలను ఆమోదించారు. అనంతరం నూతన కమిటీ కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు. ఫోరమ్ రాష్ట్ర కౌన్సిలర్లుగా కరిమి రాజేశ్వరరావు, కె.రామకృష్ణ, జిల్లా గౌరవ అధ్యక్షులుగా వై.వి.రమణ, జిల్లా గౌరవ సలహాదారుగా దానేటి కేశవరావు, జిల్లా అధ్యక్షుడిగా తులగాపు కేశవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాడాన రాజు, జిల్లా ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్‌గా మక్కా శ్రీనివాసరావు, జిల్లా సహాధ్యక్షులుగా బి.ముకుందరావు, జిల్లా ఉపాధ్యక్షులుగా ఎల్.గుణశేఖర్, జిల్లా ఆర్థిక కార్యదర్శిగా ఆర్.అన్నాజీరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్.ఎం.ఎం.ఎస్ కమిటీ కన్వీనర్‌గా ఎం.లక్ష్మణరావు, అకడమిక్ కమిటీ కన్వీనర్‌గా టి.రమణ, డాట్ కమిటీ కన్వీనర్‌గా ఎస్.రమణ, టెక్నికల్ సెల్ కన్వీనర్‌గా కె.సంతోష్‌కుమార్, మహిళా అధ్యక్షురాలుగా అధికార్ల పార్వతి, మహిళా ప్రధాన కార్యదర్శిగా సీహెచ్.సుబ్బలక్ష్మి, మహిళా ఉపాధ్యక్షులుగా జి.పావనికుమారి, ఎస్.స్వప్న, టెక్కలి డివిజన్ అధ్యక్షుడిగా సామ సంజీవరావు, ప్రధాన కార్యదర్శిగా బొడ్డేపల్లి పాపారావు, శ్రీకాకుళం డివిజన్ అధ్యక్షుడిగా పి.వి.రమణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా జి.జనార్దనరావు ఎన్నికయ్యారు.

అనుమతి లేకున్నా సభ నిర్వహణ!

శ్రీకాకుళం/శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ గురువారం ఏడురోడ్ల కూడలి వద్ద ఉన్న ఎన్టీఆర్ మున్సిపల్ స్కూల్ ఎదురుగా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ బహిరంగ సమావేశం నిర్వహించారు. అదే రోజు శంకర్ నామినేషన్ కావడంతో ఏడురోడ్ల కూడలి నుంచి పాతబస్టాండ్, పొట్టి శ్రీరాములు కూడలి, జిల్లా పరిషత్ కార్యాలయం మీదుగా కలెక్టరేట్‌కు తమ కార్యకర్తలతో ర్యాలీగా చేరుకోవడానికి మాత్రమే అనుమతి ఉంది. అయినా ఇందుకు విరుద్ధంగా సమావేశం నిర్వహించడం, సభలో ఎంపీ సైతం మాట్లాడటం గమనార్హం. ఇప్పటికే ఈ విషయం శ్రీకాకుళం ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్) ఇన్‌చార్జి దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది.

మత్స్యకారులకు మంచిరోజులు



భావనపాడు జెట్టీలో బోటుకు సబ్సిడీతో కొనుగోలు చేసిన డీజిల్‌ను నింపుతున్న మత్స్యకారుడు(ఫైల్)

- సబ్సిడీ డీజిల్ రాయితీ పెంచిన జగనన్న సర్కారు
- మోటరైజ్డ్ బోట్లకు రూ.9 సబ్సిడీ చొప్పున నెలకు 300 లీటర్ల డీజిల్
- నాలుగేళ్లలో రూ.19.78 కోట్లు రాయితీ చెల్లింపు

వజ్రపుకొత్తూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో మత్స్యకారులకు మంచి రోజులు వచ్చాయి. వేట నిషేధ భృతి ఒక్కటే కాకుండా చేపల వేటలో మోటరైజ్ బోట్లకు వినియోగించే డీజిల్ సబ్సిడీ పక్కాగా అందిస్తూ గంగపుత్రులకు అండగా నిలిచారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే లీటరుకు రూ.9 చొప్పున నెలకు 300 లీటర్ల డీజిల్‌ను అందించే కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. మత్స్యకారులకు గత టీడీపీ ప్రభుత్వంలో రూ.6.03 పైసలు సబ్సిడీ ఉండగా అది కూడా కొద్ది మందికి, అందులో టీడీపీ అనుకూలంగా ఉన్నవారికే దక్కేది. దానిని తిరగరాసిన సీఎం జగన్ మత్స్యకారులకు జరుగుతున్న అన్యాయాన్ని గమనించి లీటరుకు సబ్సిడీ రూ.9కు పెంచారు.

జిల్లాలో టీడీపీ హయాంలో ఐదేళ్లలో కేవలం 320 మందికి రూ.11.52 లక్షలు మాత్రమే అందించగా 2019–20లో సీఎంగా జగన్ అయ్యాక 1686 బోట్లకు 1338 స్మార్ట్ కార్డులతో నాలుగేళ్లలో రూ.19.78 లక్షలు ఆయిల్ సబ్సిడీని జిల్లాలోని 11 మండలాల పరిధిలో ఉన్న బంకుల్లో మత్స్యకారులకు ప్రభుత్వం నేరుగా అందించి ఆసరాగా నిలిచింది.



అభివృద్ధి పథం సంక్షేమ రథం

ఈ చిత్రంలోని వ్యక్తి పేరు గోసాల శంభూరావు. పలాస నియోజకవర్గం వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట గ్రామం. సముద్రంలో చేపల వేటే ఆధారం. గత టీడీపీ ప్రభుత్వంలో వలలు, బోట్లు అందించలని, 50 ఏళ్లు దాటిన మత్స్యకారులు పింఛన్లు మంజూరు చేయాలని కోరగా కనీసం స్పందించలేదు. దీనికితోడు జన్మభూమి కమిటీల పెత్తనం వెంటాడేది. సీఎం జగన్ వచ్చాక వీరి కష్టాలు తీరాయి. ఇతనికి మూడు చేపల వేట సాగించే బోట్లు ఉండగా ఒక్కో బోటుకు నెలకు 300 లీటర్లు చొప్పున ఏడాదికి రూ.27వేలతో జగనన్న పాలనలో మూడింటికీ రూ.4.5 లక్షలు డీజిల్ సబ్సిడీ అందుకున్నారు. అదే విధంగా, టీడీపీ ప్రభుత్వం గతంలో 4వేలు మాత్రమే వేట నిషేధ భృతి ఇవ్వగా జగనన్న సీఎం అయ్యాక రూ.10వేలకు పెంచారు. 50 ఏళ్లు దాటడంతో పింఛనూ మంజూరైంది. అందరిలాగే మిగిలిన పథకాలు వర్తించాయి. దీంతో కుటుంబ జీవన స్థితి మెరుగు పడింది.

ఆనందంగా ఉంది..



ప్రతి నెలా సబ్సిడీపై 300 లీటర్ల డీజిల్ అందింది. మత్స్యకార భరోసా కింద నాలుగేళ్లలో రూ.40వేలు వరకు లబ్ధి పొందాను. ఆయిల్ సబ్సిడీ రూ.1.35లక్షలు వచ్చింది. నా భార్యకు ఆసరా పథకంలో నాలుగు విడతలుగా రూ.80వేలు రుణమాఫీ జరిగింది. 8వ తరగతి చదువుతున్న కుమారుడికి అమ్మ ఒడి పథకంలో నాలుగు సార్లు రూ.56 వేలు వచ్చింది. మా జీవన ప్రమాణం మెరుగు పడింది.

– సైని జోగారావు, మత్స్యకారుడు, భావనపాడు, సంతబొమ్మాళి మండలం

సమస్యలు తీరాయి..



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఆర్థిక ఇబ్బందులు నుంచి బయటపడ్డాను. వేట నిషేధం సమయంలో ఇప్పటి వరకు రూ.40వేలు సహాయం అందించారు. ఆయిల్ సబ్సిడీ రూ.1.35 లక్షలు వరకు పొందాను. ప్రస్తుతం వేట చక్కగా సాగుతోంది. వలలు, నూలు కొనుగోలు నుంచి ఐస్ బాక్స్‌లు కొనుగోలు వరకు అప్పట్లో చేసిన అప్పులన్నీ తీర్చగలిగాను. ఈ ప్రభుత్వం వచ్చాక నిశ్చింతగా జీవిస్తున్నాం.

– జుత్తు భాస్కరరావు, కొత్తపేట, సంతబొమ్మాళి మండలం

● కూల్ ఐడియా





ఎండలు మండిపోతున్నాయి. 40 డిగ్రీలకు పైనే పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని సిగ్నల్ కూడళ్ల వద్ద వాహనచోదకులకు ఎండ తగలకుండా గ్రీన్‌మ్యాట్‌లు ఏర్పాటు చేశారు. అరసవల్లి మిల్లు కూడలి, ఏడు రోడ్ల కూడలి, డేఅండ్‌నైట్ కూడలి, రామలక్ష్మణ కూడలి తదితర ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయడంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేశారు.

– అరసవల్లి

నా నేస్తం వచ్చింది..!

సాక్షి ఎఫెక్ట్



వృద్ధునికి సీఐ అవతారం సమక్షంలో రిక్షా అందిస్తున్న షాపింగ్‌మాల్ ప్రతినిధులు

శ్రీకాకుళం క్రైమ్ : 'బండి కాదది.. నా నేస్తమండీ' పేరిట మార్చి 30న సాక్షిలో వచ్చిన కథనానికి ట్రాఫిక్ సీఐ అవతారం స్పందించి చొరవ తీసుకోవడంతో శ్రీకాకుళం నగరంలోని ఎస్ఆర్ షాపింగ్ మాల్ యాజమాన్యం వృద్ధుడు కంటా రామారావుకు కొత్త రిక్షాను శుక్రవారం అందించారు. మార్చిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు గాయపడటమే కాక తనకు నీడనిచ్చే రిక్షా కూడా నుజ్జునుజ్జు అయిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి ట్రాఫిక్ సీఐ, తమ సిబ్బందితో ఆసుపత్రిలో చేర్పించడమే కాక వృద్ధునికి రిక్షా ఇప్పిస్తామని మాటిచ్చారు. ఇప్పటికీ వృద్ధున్ని కుటుంబసభ్యులు పిలవకపోయినా తన నేస్తం తిరిగి వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశాడు. ట్రాఫిక్ సీఐ సమక్షంలో ఎస్ఆర్ షాపింగ్ మాల్ ప్రతినిధులు వెంకటేశ్వరరెడ్డి, రమేష్‌లు రిక్షా అందించారు.

మరణంలోనూ వీడని బంధం

- భార్య మరణం తట్టుకోలేక భర్త మృతి
- శ్యామలాపురం పునరావాస కాలనీలో విషాదం



అంత్యక్రియలు జరిపేందుకు వెళ్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు



అమ్ములు (ఫైల్)



ఏకాశి (ఫైల్)

ఎల్.ఎన్.పేట: భార్య మృతి చెందిన కొన్ని గంటల్లోనే భర్త సైతం మృతి చెందిన ఘటన ఎల్.ఎన్.పేట మండలం శ్యామలాపురం వంశధార పునరావాస కాలనీలో చోటుచేసుకుంది. నెల్లి అమ్ములు (69) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శుక్రవారం ఉదయం అమ్ములు దహన సంస్కరణకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో భర్త ఏకాశి (77) ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. పక్కకు తీసి పరిశీలించగా మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. దీంతో గ్రామంలో విషాదం అలముకుంది. ఈ దంపతులకు వివాహాలు జరిగిన ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యాభర్తలు మరణించిన సమాచారం తెలుసుకున్న పరిసర గ్రామస్తులు భారీగా తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం డిగ్రీ కళాశాలకు నాక్-బి గ్రేడ్



ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) బి-గ్రేడ్ గుర్తింపునిచ్చిందని ప్రిన్సిపాల్ డాక్టర్ రబీన్‌కుమార్ పాఢీ శుక్రవారం తెలిపారు. ఈ నెల 19, 20వ తేదీల్లో నాక్ చైర్మన్ డాక్టర్ పరమేంద్ర బాజ్‌పాయ్ నేతృత్వంలో కళాశాలను బృందం సందర్శించిన సంగతి తెలిసిందే. గతంలో సి-గ్రేడ్ ఉండేదని, ఇప్పుడు బి-గ్రేడ్ రావడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్‌తో పాటు సిబ్బంది శ్రీనివాసరావు, దుర్యోధన, సంతోకుమార్, శివకుమార్ త్రిపాఠి, నాగేశ్వరరావు, లోకేష్, రాధ, బృందావనం, వరప్రసాద్, మోహన్‌రావు హర్షం వ్యక్తం చేశారు.

నాలుగు రోజులుగా ఇంట్లోనే మృతదేహం

- అనుమానాస్పదంగా మహిళ మృతి
- మెళియాపుట్టిలో ఘటన



ఇంట్లో మృతదేహం (ఇన్‌సెట్లో) ప్రభావతి

మెళియాపుట్టి: మండల కేంద్రం మెళియాపుట్టిలో ఓ మహిళ మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మెళియాపుట్టి ఎస్సై రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. మెళియాపుట్టి మెయిన్ రోడ్ పరిసర ప్రాంతంలో గురజాడ ప్రభావతి(46) అనే మహిళ ఒంటరిగా నివాసముంటోంది. భర్త ఇదివరకే మృతిచెందగా.. పెద్ద కుమారుడు రవికుమార్ విశాఖలోని పెద్దమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. చిన్న కుమారుడు నాని జమ్మూకాశ్మీర్‌లో సీఆర్‌పీఎఫ్ జవానుగా విధులు నిర్వహిస్తున్నాడు. చిన్న కుమారుడు ప్రతిరోజూ తల్లితో ఫోన్‌లో మాట్లాడేవాడు. నాలుగు రోజులుగా ఫోన్ తీయకపోవడంతో శుక్రవారం ఉదయం పక్కింటి వారికి ఫోన్ చేసి చూడమన్నాడు. వారు వెళ్లి చూడగా ఇంటి నుంచి దుర్వాసన వస్తున్నట్లు గుర్తించి విషయం చెప్పారు. వెంటనే ఆయన విశాఖపట్నంలో ఉంటున్న సోదరుడు రవికుమార్‌కు సమాచారం అందించాడు. ఆయన వచ్చి చూడగా తల్లి మృతిచెందినట్లు గుర్తించారు. తీవ్రమైన ఎండ, అనారోగ్య కారణాలతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు, స్థానికులు భావిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వైఎస్సార్ సీపీలో చేరికల జోష్



కాశీబుగ్గ: పార్టీలో చేరిన రాంపురం యువకులకు కండువా వేస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు



పాతపట్నం: పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



జలుమూరు: పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



ఎచ్చెర్ల: పార్టీలో చేరిన జనసేన నాయకులతో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

పాతపట్నం: కొత్తూరు మండలంలోని మెట్టూరు బీట్–1 పంచాయతీ పరిధిలోని పెద్ద సంకిలి వీధికి చెందిన 100 కుటుంబాలు, బర్రిపేటకు చెందిన 70 కుటుంబాలు, దగ్గుపురం గ్రామానికి చెందిన 30 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా కార్యదర్శి బుర్లె శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఉప సర్పంచ్ గొర్లె తేజవతి, గొర్లె సురేష్, కె.రాజశేఖర్, డి.నేతాజీ, రౌతు సోమేశ్వరరావు, అదపాక కృష్ణారావు, శేషగిరి, ఉయ్యిక షణ్ముఖరావు, వార్డు మెంబర్ సవలాపురం బాలు, రాగోలు ఆది, సీమల ధనుంజయ, శివ, వీరన్న, మోహన్, సురేష్, గొంటి రమేష్, శ్రీను, బర్రి మోహనరావు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ చింతాడ సూర్యనారాయణ, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

● కాశీబుగ్గ: అవగాహన లేని శిరీష కంటే అభివృద్ధి చేసిన మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకే మా ఓటు అంటూ మందస మండలం రాంపురం పంచాయతీకి చెందిన యువకులు శుక్రవారం పలాసలోని మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఈరోతు చంద్రయ్య, దున్న సాంబమూర్తి, తామాడ కృష్ణారావు, జుత్తు లచ్చయ్య, కీలు ఉదయ్, బోడ్డు కూర్మారావు, తామాడ తరుణ్, బత్తిని లక్ష్మణమూర్తి, దున్న ధనరాజు, కరజాడ కామరాజు, కూనీరెడ్డి సత్య, తామాడ ఎర్రయ్య, కర్నేని రాజారావు, మరల సూర్యనారాయణ, కీలు రమేష్, కోయిల లక్ష్మణ్ తదితర 40 మంది ఉన్నారు.

పలాస : మండలంలోని బంటుకొత్తూరు పంచాయతీ కేశుపురం గ్రామానికి చెందిన 40 మంది టీడీపీ యువకులు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి సీదిరి అప్పలరాజు వీరికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

ఎచ్చెర్ల: లావేరు మండలం పెద్దలింగాలవలసలో జనసేనకు చెందిన 10 కుటుంబాల వారు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బోగి తవిటినాయుడు, బోగి చంద్రరావు, బోనెల కంచయ్య తదితరులు ఉన్నారు. వీరికి ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో లావేరు వైస్ ఎంపీపీ లుకలాపు శ్రీనివాసరావు, నాయకులు వాల్లె దాలినాయుడుదితరులు పాల్గొన్నారు.

జలుమూరు: సీఎం జగన్ పిలుపుమేరకు టీడీపీ, జనసేన, బీజేపీల నుంచి స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శుక్రవారం జోనంకి పంచాయతీ అబ్బాయిపేట, గంగదరపేట గ్రామాల నుంచి సుమారు 20 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. చేరిన వారిలో బెండి శ్రీనివాసరావు, బండి భాస్కరరావు, పూజారి అప్పలనాయుడు, పూజారి భాస్కరరావు, కొర్ను రామకృష్ణ, కొర్ను పాపారావు, అన్నెపు కృష్ణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, వైస్ ఎంపీపీ తంగి మురళీకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వి.రమణి, మామిడి అప్పన్న, అల్లాడ, చల్లవానిపేట పీఏసీఎస్ అధ్యక్షులు ఎం.శ్యామలరావు, పి.రాజప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, దామ మన్మధరావు, నాయకులు బుక్కా లక్ష్మణరావు, మండల సలహాదారు పైడి విఠలరావు తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని నేలబొంతు, గొద్ద గ్రామాలకు చెందిన 25 గిరిజన, ఎస్సీ కుటుంబాల వారు శుక్రవారం పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.



మెళియాపుట్టి: గొద్ద గ్రామ గిరిజనులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పలాస: కేశుపురం గ్రామానికి చెందిన యువకులను పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానిస్తున్న మంత్రి అప్పలరాజు

జూన్ 29న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్ జూన్ 29న నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పాలకొండ, పలాస, పాతపట్నం, రాజాం, సోంపేట, టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, కొత్తూరు, పొందూరు కోర్టుల్లో జరుగుతుందని పేర్కొన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో జిల్లా పోలీసు అధికారులు, ఇన్సూరెన్స్ అధికారులు, న్యాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్సూరెన్స్ అధికారులు ఎక్కువ సంఖ్యలో మోటారు వాహన ప్రమాద కేసులను రాజీ చేయడం ద్వారా ప్రమాద బాధితులకు తక్షణ సాయం అందుతుందన్నారు. రాజీతో సమయం, డబ్బులు ఆదా అవుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.